క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం సెక్షన్ పరిధిలోని 11 కేవీ టీచర్స్ కాలనీ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో శనివారం మూడు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్ర బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు టీచర్స్ కాలనీ, హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని అప్నా బజార్ రోడ్, వెలంపల్లి శ్రీనివాసరావు నగర్‌లోని 450 ఎస్ఎఫ్‌టీ బ్లాక్స్, ఓల్డ్ ఎంఐజీ, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, దర్గా ప్లాట్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

కేఎల్ రావు నగర్ సబ్ స్టేషన్ పరిధిలో..

చిట్టినగర్ సెక్షన్, కేఎల్ రావు నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోగల 11 కేవీ టైలర్ పేట ఫీడర్ విద్యుత్ లైన్ మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రవీంద్రబాబు తెలిపారు. కర్మెల్ చర్చి రోడ్, వైశ్య కాలనీ, మోతీ మసీదు, పెట్రోలు బంక్ ఎదురు, జోడు బొమ్మల సెంటర్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

శ్రీలక్ష్మీనారాయణస్వామికి ప్రత్యేక పూజలు



పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): వైకుంఠ ఏకదశి సందర్భంగా పెజ్జోనిపేటలో కొలువైన శ్రీలక్ష్మీనారాయణస్వామి శుక్రవారం ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పురవీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు స్వామివార్లకు నీరాజనాలు పలికారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాన్ని అందజేశారు.

ఓపెన్ ఫోరం ద్వారా టౌన్ ప్లానింగ్ సమస్యలకు పరిష్కారం



పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగంలో పేరుకుపోయిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహిస్తున్నామని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో ఆయా జోనల్ కార్యాలయాల్లో ప్లాన్‌ల మంజూరు, ఎల్ఆర్ఎస్, డీపీఎంఎస్ వంటి సమస్యలపై ప్రజలకు సందేహాలను అధికారులు నివృత్తి చేశారని పేర్కొన్నారు. ఈ ఫోరంలో డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు, ఇతర టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారని వివరించారు.

దుర్గమ్మ సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో తెలంగాణ రాష్ట్రం కామారెడ్డిజిల్లాకు చెందిన కళాకారులు శుక్రవారం సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. రంజిత్‌కుమార్ పర్యవేక్షణలో హాసిని, ఆశ్విజ, సహస్ర, సహన, ఇందు, ప్రియ, ఐశ్వర్య, సుదీక్ష, హంసిని, చైత్రిక, లోహిత, భవ్య, నిత్యసాయి, దైవజ్ఞ, శాన్వి తదితర కళాకారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై రంజిత్‌కుమార్ శిష్యబృందం నృత్య ప్రదర్శనను భక్తులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం కళాకారులకు ఆలయ డీఈఓ రత్న రాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఆలయ మర్యాదలతో అమ్మ వారి దర్శనం కల్పించారు.

దుర్గగుడి రికార్డు అసిస్టెంట్ సురేంద్ర మృతి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కొప్పుల సురేంద్రబాబు(53) శుక్రవారం మృతి చెందారు. దుర్గగుడిలో 22 ఏళ్లగా వివిధ హోదాలలో విధులు నిర్వహిస్తున్న సురేంద్ర రెండు రోజులుగా అనారోగ్యంగా ఉండటంతో ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. సురేంద్రకు భార్య రత్నకుమారి, కుమారుడు దుర్గాచరణ్, కుమార్తె జానకి ఉన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సురేంద్ర ఇంటి వద్ద అతని మృతదేహాన్ని దుర్గగుడి అధికారులు, సిబ్బంది పలు వురు సందర్శించి నివాళులర్పించారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

- ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన స్వామి వారు
- బారులు తీరిన భక్త జనం
- ప్రత్యేక బందోబస్తు చేపట్టిన పోలీసు శాఖ
- మధ్యాహ్నం ఊరేగిన ఉత్సవమూర్తులు



రజిత గరుడ వాహనంపై వేంకటేశ్వర స్వామి



కొత్తగుళ్లు ప్రాంగణంలో రజిత హనుమత్ వాహనంపై ఆశీనులైన పాండురంగడు



ఉత్తర ద్వారంలో కొత్తపేట వేణుగోపాలస్వామి వారు



ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న నగరాల సీతారామస్వామి దేవస్థానం స్వామి వారు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని వైష్ణవాలయాలన్నీ శుక్రవారం భక్తులతో పోటెత్తాయి. భక్తులు గంటల కొద్దీ క్యూలైన్లలో బారులు తీరి ఉత్తర ద్వారం నుంచి శ్రీమన్నారాయణుడిని దర్శించుకున్నారు. ఆలయాలు అన్నీ భక్తుల హరి నామస్మరణలతో మారుమోగాయి. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు పాతబస్తీలోని ఆయా ఆలయాల్లో స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం భక్తులతో పోటెత్తింది. ఉదయం ఐదు గంటలకు ఉత్తర ద్వారం వద్ద అత్యంత రమణీయంగా అలంకరించిన వేదికపై రజిత గరుడ వాహనంపై వేంచేయించి స్వామిని భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం స్వామి వారు గరుడవాహనంపై నగరవీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఆలయం వద్ద ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఆలయ చైర్మన్ గుడిపాటి పాపారావు, కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కొత్తగుళ్ల ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీకోదండరామాలయంలో స్వామి వారు సీతాలక్ష్మణ సమేతంగా ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూలమూర్తులకు చందనాలంకారం చేశారు. పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు పూజలు నిర్వహించారు. ఈ ఆలయ ప్రాంగణంలో కొలువై ఉన్న పాండురంగస్వామికి పూలంగిసేవ నిర్వహించారు. రజిత హనుమత్ వాహనంపై రుక్మాబాయి సమేత పాండురంగడు భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తపేటలోని శ్రీ నగరాల సీతారామస్వామి ఆలయంలో సీతా లక్ష్మణ సమేత శ్రీ రామచంద్రుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. స్వామివారు మధ్యాహ్నం గరుడ వాహనంపై ఊరేగారు. భావనారాయణ వీధిలోని శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో స్వామివారిని తెల్లవారుజామున ఐదు గంటల నుంచి ఉత్తర ద్వారం ద్వారా భక్తులు దర్శించుకున్నారు. కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామి దర్శనానికి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భక్తులు బారులు తీరారు. రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి ప్రత్యేక అలంకారం చేశారు. వించిపేట ఆబోతుల వారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామస్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ యలకల చలపతిరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



కోదండరామాలయంలో చందనాలంకారం

మార్మోగిన గోవింద నామ స్మరణ



వజ్రకవచంతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్టినగర్ పరిధిలోని పలు ఆలయాల్లో గోవింద నామ స్మరణ మార్మోగింది. స్వామిని భక్తులు ఉత్తర ద్వారం నుంచి దర్శించుకున్నారు. చిట్టినగర్‌లోని శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజామున స్వామికి వజ్రకవచాన్ని అలంకరించి, సుప్రభాత సేవ అనంతరం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఆస్థాన కల్యాణ మండపంలో ఇరుదేవేరులతో స్వామి వారు ఉత్తర ముఖంగా భక్తులకు దర్శనమిచ్చారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని స్వామి వారి ఆలయాన్ని విశేషంగా అలంకరించారు. స్వామి వారికి ఆలయ అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించగా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, వెస్ట్ ఏసీపీ దుర్గారావు, పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు దక్షిణావృత శంఖంతో తీర్థం పంపిణీచేశారు. అంతకు ముందు ధనుర్మాసాన్ని పురస్కరించుకుని స్వామి ఉత్సవ మూర్తికి పంచామృత అభిషేకాలను నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి నగరోత్సవ సేవ చిట్టినగర్‌లోని ఆలయం నుంచి ప్రారంభమై కేటీరోడ్డు, నెహ్రూ బొమ్మ సెంటర్, కోమల విలాస్ మీదగా తిరిగి ఆలయానికి చేరుకుంది. ఉత్సవ ఏర్పాట్లను కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు తమ్మిన సూర్యకుమారి, పోతిన ధర్మారావు, పోతిన సాంబశివరావు, కామందు నరసింహారావు, మజ్జి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

విజయదుర్గ ఆలయంలో...

భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సువర్చల సమేత పంచముఖ ఆంజనేయ స్వామి వారికి, సీతారామ లక్ష్మణ స్వామి వార్లకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా దేవతా మూర్తులు ఉత్తర ముఖ ద్వారం ద్వారా భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి వారికి ఆలయ అర్చకులు పవన్‌కుమార్ శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించగా, పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.



భక్తులకు దర్శనమిస్తున్న దేవేరులు



స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ప్రమాదాల కూత.. నిర్లక్ష్యం వీడకుంటే ఎలా..?



నిబంధన బోర్డు ఉన్నా ట్రాక్‌ల మీదుగా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు

- రైల్వే ట్రాక్‌ల మధ్య నుంచి రాకపోకలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రయాణికులు
- హెచ్చరిక బోర్డులతో సరిపెట్టిన ఆర్‌పీఎఫ్



ఆర్‌పీఎఫ్ పోలీసులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఒక పక్క రైలు ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామంటూ రైల్వే శాఖ ప్రచారం చేస్తోంది. మరో పక్క ప్రమాదం అని తెలిసినప్పటికీ త్వరగా చేరుకోవచ్చన్న ఉద్దేశంతో నిర్లక్ష్యంగా రైలు ట్రాక్‌ల మధ్య నుంచి రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులను నియంత్రించడంలో మాత్రం పూర్తిగా విఫలమైంది. విజయవాడ రైల్వే స్టేషన్‌లో నిత్యం వేల మంది ప్రయాణికులు వివిధ ప్లాట్ ఫారాల నుంచి పట్టాలను దాటుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ప్రమాదం జరిగిన తరువాత నివారణ చర్యలు తీసుకోవడం కంటే అది జరగక ముందే ట్రాక్‌లు దాటుతున్న ప్రయాణికులను అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. విజయవాడ రైల్వే స్టేషన్‌లో పది ప్లాట్‌ఫారాలు ఉన్నాయి. వాటిని చేరుకోవడానికి తూర్పు, దక్షిణం, పశ్చిమ బుకింగ్ కౌంటర్ నుంచి ప్రవేశ మార్గాలు ఉన్నాయి. అక్కడ నుంచి ప్రయాణికులు తమ రైలు వచ్చే ప్లాట్‌ఫాంనకు చేరుకోవడానికి ప్రత్యేకంగా ఫుట్ బ్రిడ్జిలు, ఎస్కలేటర్లు, లిఫ్టల సదుపాయాలు ఉన్నాయి. అయితే చాలా మంది ప్రయాణికులు దగ్గర మార్గంగా ఉంటుందని ప్రమాదకరమని తెలిసినా ట్రాక్‌ల మధ్య నుంచి రాకపోకలు సాగిస్తూ ఆయా ప్లాట్ ఫారాలకు, స్టేషన్ బయటకు చేరుకుంటున్నారు.

త్వరగా చేరుకోవచ్చన్న భావనతో..

రైల్వేట్రాక్‌ల మధ్య రాకపోకలపై నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయి. కానీ వాటిని పర్యవేక్షించేదుకు ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉండరు. దీంతో ట్రాక్‌ల మధ్యలో అనధికారిక రాకపోకలు జరుగుతున్నాయి. కాళేశ్వరరావు మార్కెట్ సమీపం నుంచి తారాపేటలోకి వెస్ట్ బుకింగ్ కార్యాలయం మీదుగా పదో నంబర్ ప్లాట్‌ఫాం నుంచి ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం వరకు ట్రాక్‌ల మధ్యలో నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. బస్ స్టేషన్ నుంచి వచ్చే ప్రయాణికులు షార్ట్ కట్‌గా ఉంటుందని పార్శిల్ కార్యాలయం నుంచి ట్రాక్‌ల మధ్య నుంచి రాకపోకలు చేసి వివిధ ప్లాట్ ఫాంలకు చేరుకుంటున్నారు.

హెచ్చరిక బోర్డులకే పరిమితం

ముఖ్యంగా రైల్వేపార్శిల్ కార్యాలయం నుంచే ఎక్కువ మంది ప్రయాణికులు ట్రాక్‌లు దాటుతుంటారు. అక్కడ ఆర్‌పీఎఫ్ సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తూ పార్శిల్ వాహనాలు, గుర్తింపు కార్డులను చూసి రైల్వే ఉద్యోగులను మాత్రమే అనుమతించాల్సి ఉంటుంది. కానీ అవేవీ అమలు కావటం లేదు. కేవలం హెచ్చరిక బోర్డులు పెట్టి వదిలివేయడంతో ప్రయాణికులు యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘించి ప్రమాదరకంగా ట్రాక్‌లపై రాకపోకలు సాగిస్తున్నారు. ఎటువంటి ప్రమాదం జరగక ముందే ట్రాక్‌ల మధ్యకు ప్రయాణికులను అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని రైల్వే సిబ్బంది సైతం కోరుతున్నారు.

శాశ్వత పరిష్కారానికి చర్యలు

> ముఖ్యంగా పార్శిల్ కార్యాలయం వద్ద వారి వాహనాల కోసం గేటును తెరవాల్సి వస్తుంది. దీంతో ప్రయాణికులు కూడా ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. సిబ్బంది సంఖ్య కూడా తక్కువగా ఉండటంతో పర్యవేక్షణ ఇబ్బందులు ఉన్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపడతాం.
>
> – ఫతే అలీబేగ్, ఆర్‌పీఎఫ్ సీఐ



రైల్వే ట్రాకుల మీదుగా ప్రయాణికుల రాకపోకలు

డీసిల్టింగ్ ప్రక్రియను ప్రారంభించాలి

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని అన్ని ప్రాంతాల్లో డీసిల్టింగ్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం, ఈట్ స్ట్రీట్, ఏలూరు రోడ్డు, మాచవరం, ఈఎస్ఐ హాస్పిటల్, క్రీస్తురాజుపురం, ఏఎస్ రామారావు రోడ్డు, ఎస్సీ కాలనీ, లయోల కాలేజీ రోడ్డు, మధు చౌక్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో భారీ వర్షాలు కురిసినప్పుడు 72 ప్రాంతాల్లో నీరు నిలుస్తోందని అధికారులు గుర్తించారని, ఆయా ప్రాంతాల్లోని డ్రెయిన్లలో నిరంతరం డీసిల్టింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రధాన ఔవుట్‌ఫాల్ డ్రెయిన్లలో కలిసే మురుగు కాలువలను నిరంతరం పర్యవేక్షిస్తూ డీసిల్టింగ్ చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఏలూరు రోడ్డు, మాచవరం ప్రాంతంలో భూగర్భ డ్రెయిన్ పొంగుతోందని, ఆ సమస్యను త్వరగా పరిష్కరించాలని పేర్కొన్నారు. క్రీస్తు రాజపురం ఎస్సీ కాలనీలో ఎప్పటి నుంచో నిలిచి ఉన్న పాత ద్విచక్ర, నాలుగు చక్ర వాహనాల వల్ల ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీస్‌ల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద పాడైపోయిన కల్వర్ట్‌ను గమనించి వెంటనే మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మధు చౌక్ సెంటర్ వద్ద గుహల ముందు డ్రెయిన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ సమన్వయంతో రోడ్లపైనున్న నిర్మాణ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి పాల్గొన్నారు.

సీపీని కలిసిన ఉద్యోగోన్నతి పొందిన పోలీసులు



సీపీ రాజశేఖరబాబును కలిసిన ఏఎస్ఐలు, హెచ్‌సీలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగోన్నతి పొందిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, హెడ్ కానిస్టేబుళ్లు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సర్వీస్ ప్రాతిపదికన అర్హత కలిగిన ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా, ముగ్గరు కానిస్టేబుళ్లు హెడ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి పొందారు. సీపీని కలిసినవారిలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు పి.సత్యనారాయణ (2243), జె.ప్రమీలా రాణి (642), పి.వరలక్ష్మి (141), హెడ్ కానిస్టేబుళ్లలో డి.నాగసురేష్ (2189), పి.ప్రసన్న (670), ఎం.సురేష్ (2178) ఉన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ రాజశేఖర బాబు వారందరినీ అభినందించారు.

వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించాలి

ఏపీ చీఫ్ సెక్రటరీ విజయానంద్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చీఫ్ సెక్రటరీ విజయానంద్ తదితరులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఎస్‌బీఐ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని, విరివిరిగా రుణాలు ఇచ్చి రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నారు. ఆటోనగర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పటమట ఎస్ఎంఈ బ్రాంచ్ శాఖ అధ్వర్యంలో 58వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. విజయానంద్ జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వినియోగదారుల లాంజ్‌తో పాటు మొబైల్ ఏటీఎంను, వినియోగదారులు వేచివుండే ప్రత్యేక గదిని విజయానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజరు రాజేష్‌కుమార్ పాటిల్ మాట్లాడుతూ.. ఎస్‌బీఐ అన్ని వర్గాల ప్రజలకు సకాలంలో రుణాలు ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పటమట ఎస్ఎంఈ చీఫ్ మేనేజరు జి.కేశవరావు, రీజినల్ ఏవీఆర్ సుబ్బారావు, డెప్యూటీ జనరల్ మేనేజర్లు మనీష్ కుమార్ సింగ్, కుమార్ మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభకు పదును పెట్టాలి



విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ సుబ్బారావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమలోని ప్రతిభకు పదును పెట్టినప్పుడు మంచి విజయాలను అందుకుంటారని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి. సుబ్బారావు అన్నారు. దక్షిణ భారత జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్-2025కు ఎంపికైన ఎన్టీఆర్ జిల్లా విద్యార్థులను జిల్లా విద్య శాఖ అధికారి సుబ్బారావు ఆయన కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరంలో ఇటీవల జరిగిన సైన్స్ ఫెయిర్‌లో 156 ప్రాజెక్టులు పాల్గొనగా వాటిలో నుంచి 35 ప్రాజెక్టులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాయని చెప్పారు. అందులో ఎన్టీఆర్ జిల్లా తరఫున ఒక స్టూడెంట్ విభాగం నుంచి గంపలగూడెం మోడల్ స్కూల్ విద్యార్థి సుదక్ష, జగ్గయ్యపేట బాయ్స్ హైస్కూలు నుంచి ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. మోడల్ స్కూల్ తరఫున రోలింగ్ రోబో ప్రాజెక్టు, జగ్గయ్యపేట జిల్లా పరిషత్తు హైస్కూలు తరఫున వరదలో వచ్చినప్పుడు బ్యారేజ్ అనేవి ఏ విధంగా నిర్మించాలి, వాహనాలు, మనుషులను ఏ విధంగా కాపాడాలి అనే ప్రాజెక్టు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని వెల్లడించారు. ఈ నెల 20 నుంచి పుదుచ్చేరిలో జరగనున్న దక్షిణ భారత జాతీయ స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా, బరియల్ గ్రౌండ్ పరిశీలన



షాదీఖానా గ్రౌండ్‌లో అబ్దుల్ అజీజ్, ఖాదిరి

భవానీపురం(విజయవాడపశ్చిమ): గట్టు వెనుక ప్రాంతం, విద్యాధరపురం గుప్తా సెంటర్‌లోని షాదీఖానా, పక్కనే ఉన్న బరియల్ గ్రౌండ్‌ను రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, సీఈఓ అబ్దుల్ ఖాదిర్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. షాదీఖానా, బరియల్ గ్రౌండ్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు గల సాధ్యాసాధ్యాలను పరిశీలించామని తెలిపారు. విద్యాధరపురంలోని ఎన్‌టీఎస్ నంబర్ 128లోని 6.90 ఎకరాల భూమిని ముస్లింల శ్మశానవాటికకు కేటాయించారని పేర్కొన్నారు. మిగిలిన 3.90 ఎకరాల భూమి అభివృద్ధి కోసం వినియోగించాలని గెజిట్‌లో ఉందని వివరించారు. ఈ క్రమంలో ఆ స్థలాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలనే అంశంపై నిర్ణయం తీసుకుని, ఆ దిశగా చర్యలు తీసుకుంటామని వివరించారు.

సంస్కృతీ సంప్రదాయాలను వివరించే పండుగలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సంక్రాంతి వంటి పర్వదినాలు విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తాయని వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. చలువాది మల్లికార్జునరావు పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా సాగాయి. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. కళాశాల అధ్యక్షుడు చలువాది మల్లికార్జునరావుతో కలిసి వేముల హజరత్తయ్య గుప్తా విద్యార్థులను అభినందించారు.

అంబేడ్కర్ యూనివర్సిటీ ఏర్పాటు కోరుతూ ధర్నా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని దళిత బహుజన పరిరక్షణ సంఘం(డీబీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్‌లో డీబీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని అంబేడ్కర్ యూనివర్సిటీలో మనరాష్ట్ర విద్యార్థులను చేర్చుకోకపోతుండటంతో రాష్ట్రంలో 2లక్షల మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే అంబేడ్కర్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు జి.జోసఫ్, కె.వీరన్న, శివప్రసాద్, అమర్నాథ్, రామచంద్రరావు, ధనరాజు పాల్గొన్నారు.

అలరించిన బొమ్మల కొలువు పోటీలు



బొమ్మల కొలువు ప్రదర్శనను తిలకిస్తున్న రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి సమితి చైర్‌పర్సన్ తేజస్వి

కృష్ణలంక(విజయవాడతూర్పు): పండుగ సంస్కృతులను కాపాడుకోవటం అందరి కర్తవ్యమని రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి చైర్‌పర్సన్ పి.తేజస్వి అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్స్, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బిర్లా ఓపెన్ మైండ్స్ సౌజన్యంతో శుక్రవారం సంక్రాంతి బొమ్మల కొలువుల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో సాగాయి. ముఖ్య అతిథి తేజస్వి ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గుమ్మా సాంబశివరావు, రచయిత వేమూరి సత్యవతి సంక్రాంతి పండుగ విశేషాలు, బొమ్మల కొలువు ప్రత్యేకతలను వివరించారు. అనంతరం మూడు ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు, పాల్గొన్న వారందరికీ జ్ఞాపికలు అందజేశారు. పిల్లలకు భోగిపళ్లు, సందె గొబ్బెమ్మలు కార్యక్రమాలను ఉత్సవంగా నిర్వహించారు. ఎంబీ విజ్ఞాన కేంద్రం బాధ్యులు కె.స్వరూపరాణి, పి.విజయ, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ బాధ్యులు ఎ.సునీల్‌కుమార్, ఎ.సంధ్యారాణి, ఎ.గిరిధర్, సెయింట్ జాన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ భారతి, హనుమకొండ సరోజిని, డాక్టర్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.